క్లుప్తంగా

మైనార్టీ రుణాలకు లబ్ధిదారుల ఎంపిక

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం మైనార్టీలకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మైనార్టీ రుణాలకు లబ్ధిదారులను మంగళవారం లాటరీ పద్ధతిన ఎంపికచేశారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు లాటరీ తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. రూ.1 లక్ష జనరల్‌లో 2, మహిళా కోటాలో 2, మైనార్టీ కోటాలో ఇద్దరిని ఎంపిక చేశారు. రూ.2 లక్షలు గాను ఇద్దరిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పితాని వెంకటేశ్వర్లు, మెప్మా టీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఏపీజీవీబీ బ్రాహ్మణపల్లి మేనేజర్ సుబ్బారావు, ఎస్‌బీఐ అధికారులు సతీష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

'క్షయ'పై అవగాహన

తల్లాడ: మండలంలోని బిల్లుపాడులో మంగళవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. డాక్టర్ రత్న మనోహర్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి భాస్కర్, టీబీ నోడల్ పర్సన్ పెద్ద పుల్లయ్య, టీబీ సూపర్‌వైజర్ సురేష్, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

కొణిజర్ల: మండల పరిధిలోని చిన్నగోపతిలో వివిధ పోటీ పరీక్షలకు, నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను ఓబీసీ ఐక్యవేదిక నాయకుడు దునుకు యాలాద్రి పుస్తకాలను వితరణగా అందజేశారు. సర్పంచ్ జిల్లా మహేష్, ఉపసర్పంచ్ డేరంగుల లక్ష్మయ్య, సామాజిక కార్యకర్త శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి భార్గవి, రాజేష్, నరసింహారావు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మధిర: మండలంలోని ఆత్కూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మధిర పట్టణానికి చెందిన సాయి మణికంఠ శానిటరీస్ అధినేత దేవిశెట్టి రంగారావు, కల్పన దంపతులు మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలగపూడి హనుమంతురావు, డాలు కృష్ణ, ధరణి శ్రావ్య, సాయి మణికంఠ పాల్గొన్నారు.

పూజలు..

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లి శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం డాక్టర్ మట్టా దయానంద్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లారి వెంకటేశ్వరరావు, కిలారి వెంకటేశ్వరరావు, ఇమ్మినేని ప్రసాదరావు, దొడ్డా శ్రీనివాసరావు, బేతిని శ్రీను, చీకటి చెన్నారావు, పోల్లూరి వెంకటేశ్వరరావు, రాగం సత్యంబాబు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైపై సీపీకి ఫిర్యాదు

ఏన్కూరు: ఏన్కూరు ఎస్సై సాయికుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ ఖమ్మంలో సీపీ విష్ణువారియర్‌కు మంగళవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏన్కూరులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయగా ఎస్సై అతడిని అరెస్ట్ చేయలేదని దీనిపై విచారణ చేయాలని సీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై ఎస్సై సాయికుమార్‌ను వివరణ కోరగా ఏన్కూరులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేయాలని తనకు ఆదేశాలు వచ్చాయని గాలించగా అతడు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలిసిందని, అక్కడ కూడా ఆచూకీ దొరకలేదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు.

రుణాల లబ్ధిదారుల ఎంపిక వాయిదా

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వాయిదా వేశారు. మండలంలో 31 పంచాయతీల్లోని మైనార్టీ యువతకు కేవలం ఆరుగుర్ని ఎలా ఎంపిక చేస్తారని మైనార్టీ యువత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. లాటరీ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలపరిషత్ కో ఆప్షన్ సభ్యులు తదితరులు ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ అధికారి రహీం, ఈఓఆర్డీ శ్రీలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరెడ్డి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సమ్మర్‌క్యాంపులు రద్దు చేయాలి

పెనుబల్లి : ఉపాధ్యాయుల అంగీకారం లేకుండా బలవంతంగా ప్రారంభిస్తున్న సమ్మర్ క్యాంపులను రద్దు చేయాలని కోరుతూ మండల పరిధిలోని కుప్పెనకుంట్ల జ్యోతిబాపులే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యారావు, ఉపాధ్యాయులు డి.సురేష్, అజయ్, ప్రీతి, కె. శ్రీనివాస్, పి.కృష్ణ, బి.జాను తదితరులు ఉన్నారు. ఈ నిరసనకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వివి రామారావు, జిల్లా పూర్వ కార్యదర్శి ఎం నరసింహారావులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఇన్‌చార్జ్‌లతోనే వెళ్లదీత..!

మున్సిపాలిటీల్లో భర్తీ కాని టీపీఓ పోస్టులు

- ఒక్కొక్కరు రెండు, మూడు జిల్లాల్లో విధులు
- 'ప్లానింగ్' సలహాలు ఇచ్చే వారు లేక ప్రజల ఇక్కట్లు



వైరా మున్సిపాలిటీ కార్యాలయం

వైరా: జిల్లాలో కొత్తగా ఏర్పడిన వైరా మున్సిపాలిటీతో పాటు గతంలోనే ఉన్న మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో పూర్తి స్థాయి పట్టణ ప్రణాళిక అధికారుల(టీపీఓ) పోస్టులు భర్తీ చేయలేదు. పక్కనే ఉన్న మున్సిపాలిటీలోని అధికారులను ఇన్‌చార్జులుగా నియమించి కాలం నెట్టుకొస్తున్నారు. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీగా మారడం, అందులోనూ విలీన గ్రామ పంచాయతీలు ఉండటంతో ఇళ్లు, భవనాలు, ఖాళీ స్థలాలు, లేఅవుట్ల సమస్యలు ఇబ్బందిగా మారాయి. కొన్నిచోట్ల గొడవలు జరుగుతూ కోర్టులను ఆశ్రయిస్తున్నారు. పేద, మధ్యతరగతి వారు నిర్మాణాలు చేపట్టాలంటే ప్లానింగ్, భవిష్యత్‌లో సమస్య రాకుండా ఎలా ముందుకెళ్లాలనే సలహాలు ఇచ్చేందుకు పూర్తిస్థాయి టీపీఓలను నియమించాల్సి ఉంది. దరఖాస్తు తిరస్కరణకు గురైతే కారణమేమిటనే సమాచారం ఇచ్చేందుకైనా వారు ఉండాల్సి ఉన్నా.. అలా జరగడం లేదు.

వారాంతాల్లోనే విధులు..

వైరా, మధిర మున్సిపాలిటీలో టీపీఓలు ఇన్‌చార్జ్‌లే విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు, మూడు మున్సిపాలిటీల బాధ్యతలు ఉండటంతో వారాంతాల్లో వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అసలు టీపీఓ ఉన్నారనే సంగతి కూడా కొన్ని మున్సిపాలిటీల్లో తెలియని పరిస్థితి ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వెళ్తారు. ఆపై టీపీఓ తన లాగిన్ ద్వారా వాటిని పరిశీలించి అనుమతిస్తే కమిషనర్ ఆమోదిస్తారు. అయితే, పూర్తి స్థాయి టీపీఓలు లేకపోవడంతో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరుగుతోంది. ఎవరైనా అనుమానాలు నివృత్తి కోసం కార్యాలయానికి వెళ్తే అందుబాటులో ఉండడం లేదు. గృహ నిర్మాణ సమయాన దరఖాస్తుతో పాటు ప్రణాళిక సమర్పించకున్నా పర్వాలేదు కానీ వాణిజ్య భవనాలు, అపార్ట్‌మెంట్లకు మాత్రం తప్పదు. వీటి కోసం అనుమతి ఉన్న సాంకేతిక నిపుణులను ఆశ్రయించాల్సి వస్తోంది. అన్ని పత్రాలు సవ్యంగా ఉండి దరఖాస్తు చేసుకున్న 21 రోజుల లోపు తిరస్కారం లేదా అనుమతి ఇవ్వకపోతే అనుమతి వచ్చినట్లుగానే భావించాలనే నిబంధన ప్రజలకు ఊరట కలిగించే విషయం.

శివారు కాలనీలు, గ్రామాల్లో సమస్యలు అధికం..

గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చడంతో లేఅవుట్ల సమస్యలు చాలానే ఉన్నాయి. చాలాచోట్ల దారి, అక్రమ కట్టడాల గొడవలు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు స్థలాలకు సరైన పత్రాలు లేకపోవడం, వెంచర్ల ఏర్పాటులో నిబంధనలు పాటించకపోవడం సమస్యాత్మకంగా మారింది. ఇంటి నిర్మాణానికి ఎంత మేర సెట్‌బ్యాక్ ఇవ్వాలి. ఎంత మేరా రోడ్లు, ఖాళీ స్థలాలు ఉంచుకొని నిర్మాణాలు చేపట్టాలనే విషయాలపై అవగాహన లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

రెండు మున్సిపాలిటీల్లో ఇది పరిస్థితి...

జిల్లాలోని వైరా, మధిర మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా కూడా టీపీఓలు పర్మినెంట్‌గా లేరు. వైరా ఇన్‌చార్జ్ టీపీఓ ప్రశాంత్ వైరాలో రెండు రోజులు, ఖమ్మం 'సుడా' పరిధిలో నాలుగు రోజులు పనిచేస్తున్నారు. అప్పుడప్పుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీకి కూడా వెళ్లాల్సి వస్తోంది. మధిరలో పనిచేసే టీపీఓ రమేష్ మధిరలో నాలుగు రోజులు, రెండు రోజులు మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పోస్టులను భర్తీ చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

టీపీఓలతోనే సమస్యల పరిష్కారం



మున్సిపాలిటీలో భవన అనుమతులు కావాలంటే టీపీఓలే కీలకం. పూర్తి స్థాయిలో టీపీఓలు ఉంటే త్వరగా అనుమతులు జారీ చేయొచ్చు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఉన్నప్పటికీ మున్సిపాలిటీ పరిధిలో భవన అనుమతుల్లో పెండింగ్‌లో లేవు.

– పతాని వెంకటేశ్వర్లు, కమిషనర్, వైరా

పెండింగ్ లేకుండా చూస్తున్నాం..

మున్సిపాలిటీ పరిధిలో భవన అనుమతులు పెండింగ్ లేకుండా చూస్తున్నాం. అంతా ఆన్‌లైన్‌లోనే భవన అనుమతులు ఇస్తున్నాం. భవన అనుమతులతో పాటుగా మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీ నిర్మాణ పనులను కూడా పర్యవేక్షిస్తున్నాం.

– ప్రశాంత్, ఇన్‌చార్జ్ టీపీఓ, వైరా


వైరాలో అధికారులతో కలిసి విధులు నిర్వర్తిస్తున్న టీపీఓ ప్రశాంత్ (ఫైల్)

మధిరలో గులాబీ జెండా ఎగురవేస్తాం

- ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

బోనకల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మధిర గడ్డపై గులాబీజెండా ఎగురవేస్తామని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని జానకీపురం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అభివృద్ధి జరగగా.. యావత్ దేశం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటోందని చెప్పారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే అధికారం అన్నారు. కాగా, కొందరు నాయకులు పార్టీ గొడుగు కింద పెరిగి ద్రోహం చేయాలని చూస్తున్నారని, డబ్బుతో చేసే రాజకీయాలు ఎంతోకాలం నిలవవని ప్రజలకు తెలుసునని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు చేబ్రోలు మల్లికార్జున్ రావు, మోదుగుల నాగేశ్వరావుతో పాటు వేమూరి ప్రసాద్, బానోతు కొండ, బంధ శ్రీను, తమ్మారపు బ్రహ్మయ్య, బందం నాగేశ్వరావు, సర్పంచ్‌లు కొమ్మినేని ఉపేందర్‌రావు, జెర్రిపోతుల ఉపేందర్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను అవమానించొద్దు..

చింతకాని: ఉద్యమకారులను అవమానిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి అన్నారు. చింతకాని మండలం నాగులవంచలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఎనిమిదేళ్లు తాను పనిచేయగా.. కొన్నాళ్ల నుంచి జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ పార్టీ కార్యక్రమాలకు పిలవకుండా అవమానిస్తున్నారని ఆరోపించారు. బోనకల్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి తనను, నల్లమల వెంకటేశ్వరావును ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ, దర్సి బాలకృష్ణ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన


ఫాదర్‌ను సన్మానించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తల్లాడ: మండలంలోని మంగళవారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆర్థికసాయం అందజేసి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పాత మిట్టపల్లిలో తొర్లపాటి జోజి పాస్టర్‌గా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సన్మానించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు నారపోగు వెంకటేశ్వరరావు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, పగడాల లచ్చిరెడ్డి, యర్రి నరసింహారావు, తుమ్మలపల్లి రమేష్, వరికొల్లి రమేష్, గణేశుల రవి, మాగంటి కృష్ణయ్య, కొమ్మూరి దర్గయ్య, శీలం నాగిరెడ్డి, దర్గయ్య, దమ్మాలపాటి ప్రకాశరావు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ సేవలు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివరామ్‌ప్రసాద్

సత్తుపల్లిటౌన్: సమాజహితం కోసం వాసవీక్లబ్ అందజేస్తున్న సేవలు అభినందనీయమని అదనపు జిల్లా జడ్జి శివరామ్‌ప్రసాద్ అన్నారు. సబ్‌జైల్‌లో న్యాయవాది సోమిశెట్టి శ్రీధర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్, కోర్టు గేటు వద్ద, పాతబస్టాండ్ సెంటర్‌లలో వాసవీక్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసి చలివేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. అదేవిధంగా వాసవీ సురక్ష పథకంలో సభ్యురాలైన నంబూరి భారతిలక్ష్మి మృతి చెందటంతో ఆమె కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ దోసపాటి వెంకటేశ్వరరావు అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, జూనియర్ సివిల్ జడ్జి శ్రావణస్వాతి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అయేషా సరీనా, పోలిశెట్టి శివకుమార్, అధ్యక్షులు పోకూరి కృష్ణప్రసాద్, గుడిమెట్ల ప్రసాద్, వనమా నరేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, మల్లూరు అంకమరాజు, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, సత్యనారాయణ, సాంబశివరావు, ఉమామహేశ్వరరావు, ఆదినారాయణ, విశ్వనాథం, నారాయణగుప్త, గన్నవరపు చరణ్, వంటిపల్లి కిషన్ అనిల్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ హర్షణీయం

కల్లూరు: వేసవిలో ప్రయాణికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ సత్తుపల్లి డిపో ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేయడం హర్షణీయమని సత్తుపల్లి రూరల్ సీఐ హనూక్ పేర్కొన్నారు. కల్లూరులోని నూతన బస్టాండ్‌లో ఉచిత మజ్జిగ పంపిణీని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మితో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. మజ్జిగ పంపిణీ చేసేందుకు ముందుకొచ్చిన కార్గో ఎగ్జిక్యూటివ్ మునీర్ బాషాను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది కిన్నెర ఆనందరావు, కంచి శ్యాంసన్, మరకాల రత్నాకర్, నల్లగట్ల మారేశ్వరరావు, నల్లగట్ల కోటేశ్వరరావు, రాయల సుందరం పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తి

కల్లూరు రూరల్: మండలంలోని చెన్నూరు–పెద్దకోరుకొండి మధ్య ఈనెల 19న జరగనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమానికి హాజరయ్యే కార్యకర్తలు, ప్రజలకు ఇబ్బంది ఎదురుకాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించాక స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమై సూచనలు చేశారు.

కంటివెలుగు శిబిరం

వైరారూరల్: మండలంలోని అష్టగుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన రెండవ విడత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం సర్పంచ్ ఇటుకల మురళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ వుంద్రూ శ్యాంబాబు, భాంధవి, సూపర్‌వైజర్ కనకతార, ఏఎన్ఎం అరుణకుమారి, బేబిరాణి, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న అవశేషాలను కాల్చొద్దు

కొణిజర్ల: మొక్కజొన్న పంట కోతల తర్వాత వాటి అవశేషాలను రైతులు కాల్చి వేస్తున్నారని అలా చేయడంతో రైతులకు చాలా నష్టాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ అన్నారు. మంగళవారం ఆయన కొణిజర్లలో రైతులతో మాట్లాడారు. అవశేషాలను కాల్చి వేసిన తర్వాత మట్టిపై పొరలలో ఉండే పోషకాలు కూడా వరద నీటితో కొట్టుకుపోతాయన్నారు. రైతులు భూమిని కాపాడుకుంటూ సేంద్రీయ వ్యవసాయం చేయాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెనుబల్లి: మండల పరిధిలోని యడ్లబంజర్‌లో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ లక్కినేని అలేఖ్య మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సోమరాజు రమాదేవి, స్థానిక నాయకులు లక్కినేని వినీల్, యడ్ల సుబ్బారావు, యడ్ల నరసింహారావు, సుంకర నాగయ్య, జంపా వియస్‌బాబు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని దాచాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గరికపాడు సొసైటీ చైర్మన్ అయిలూరి కృష్ణారెడ్డి ప్రారంభించారు. గరికపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సర్పంచ్ వేల్పుల జయరాజు, ఉసర్పంచ్ రామిశెషిరెడ్డి, ఎంపీటీసీ మాగంటి సుందరమ్మ, సొసైటీ సీఈఓ అక్కిశెట్టి రామకృష్ణ, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.


వైరారూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్, తదితరులు


పెనుబల్లిలో..

ఉచిత కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఏసీపీ రామానుజం

పెనుబల్లి : వియం బంజర్ రాజసాయి మందిరం ఆధ్వర్యంలో ఖమ్మం మమత ఆసుపత్రి వైద్యులు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరాన్ని కల్లూరు ఏసీపీ బి. రామానుజం ప్రారంభించగా ఆయనతో పాటు సత్తుపల్లి రూరల్ సీఐ సీహెచ్ హనూక్, వియంబంజర్ జి.సూరజ్‌లు పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మందిరం నిర్వాహకులు జెన్నా రెడ్డి నరసింహారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారిణికి సన్మానం


సత్యకుమారిని సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: పట్టణానికి చెందిన రంగస్థల కళాకారిణి నంద్యాల సత్యకుమారి(సక్కు)ని గుంటూరులో సన్మానించారు. అక్కడ సోమవారం జరిగిన సమావేశంలో జిల్లా కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం, గౌరీ శంకర కళానాట్యమండలి బాధ్యులు ఆమెను సన్మానించి కళావాణి బిరుదు అందజేశారు. నల్లక శ్రీనివాసరావు, సానిశెట్టి సాంబశివరావు, దర్శి శ్రీను, గురువు పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

ముదిగొండ: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ టీఎస్ కల్యాణ్ కోరారు. ముదిగొండలోని మచ్చా వీరయ్య భవనం నుంచి ప్రధాన సెంటర్ వరకు మంగళవారం వీఓఏలు ప్రదర్శన నిర్వహించారు. వీఓఏలు కవిత, శ్రీదేవి, అరుణ, సైదాబీ, పద్మ, శారదలు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ దీపికలు సమ్మె

తల్లాడ: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ దీపికల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామ దీపికలు సమ్మె నోటీసు అందజేశారు. ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, తహసీల్దార్ గంటా శ్రీలత, ఎస్సై సురేష్, ఏపీఎం శ్రీనివాసరావు, స్థానిక ఎస్‌బీఐ, యూనియన్, ఏపీజీవీబీ శాఖలకు సమ్మె నోటీసు అందజేశారు. కనీస వేతనం నెలకు రూ.18,000 ఇవ్వాలని, రూ.10 లక్షలు ఆరోగ్య బీమా కల్పించాలనీ, అర్హత కల్గిన వీఓఏలకు సీసీ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అధికారంలోకి వస్తే ఒకేసారి రుణమాఫీ..


ప్రచారం చేస్తున్న సంభాని చంద్రశేఖర్

వేంసూరు: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకేసారి రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగపాలెంలో ప్రచారం చేశారు. నాయకులు పుచ్చకాయల సోమిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు రావుల పుల్లారావు, శ్రీను, కోట సత్యనారాయణ, కట్టా అశోక్, మల్లెల్లి నరసింహరావు పాల్గొన్నారు.

తెల్లపాలెంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర..


ప్రచారం చేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని తెల్లపాలెం గ్రామంలో మంగళవారం హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పార్టీ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు బండారు నర్సింహారావు, కడియం శ్రీనివాసరావు,కంచర్ల వెంకటనర్సయ్య, వేమిరెడ్డి అరవింద్‌రెడ్డి, షేక్ జానీబాషా, యన్నం పిచ్చిరెడ్డి, దేవరకొండ శ్రీనివాసరావు, బాబురావు, రాజేష్, మేరి చెన్నయ్య, ఏడు కొండలు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

చింతకాని: రైతులు పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర దక్కేలా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొప్పుల గోవిందరావు డిమాండ్ చేశారు. చింతకానిలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు సాయాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు బందెల నాగార్జున్, షేక్ అబ్దుల్ మజీద్, సైదేశ్వరరావు, లగడపాటి జోగారావు, వడ్రాణపు బాబురావు, ప్రసాద్ రావు పాల్గొన్నారు.

బాలిక విద్యను ప్రోత్సహించాలి

ఏన్కూరు: బాలిక విద్యను ప్రోత్సహించాలని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేకాధికారి ఉషారాణి కోరారు. మండల పరిధిలోని తిమ్మారావుపేట, జన్నారం గ్రామాల్లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం బృందం మంగళవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.స్రవంతి, బి.శిరీష, కె.సరిత పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి


మధిర: వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

మధిర: విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ వై. ప్రభాకర్ అన్నారు. మధిర బాలికల ప్రాథమిక పాఠశాలలో వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు వివిధ వేషధారణలతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నారాయణ, నోడల్ ఆఫీసర్ దీన్ దయాల్, ప్రధానోపాధ్యాయులు స్వప్న, కోటారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ ప్రకాష్, కౌన్సిలర్ నాగసులోచన, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడు ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ బండారు నర్సింహారావు, హెచ్ఎం దుద్దుకూరు లింగయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఉప్పతల వెంకటనారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు చీరలు వితరణ


చీరలతో మహిళలు..

సత్తుపల్లి: రంజాన్‌ను పురస్కరించుకుని సత్తుపల్లిలోని పేద వృద్ధ మహిళలకు సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ల సుధారాణి మంగళవారం చీరలు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల్లో 40 మందికి ఆమె చీరలు అందజేయగా, మహిళలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

రంజాన్ కానుకల పంపిణీ

రంజాన్‌ను పురస్కరించుకుని ప్రభుత్వం ముస్లింలకు అందజేస్తున్న రంజాన్ తోఫాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరా: ముస్లింలకు రంజాన్‌తోఫా అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్


ముదిగొండ: దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం


కారేపల్లి షాదీఖానాలో..